# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 30, అక్టోబర్ 2025






# పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదు

★ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

★ అమరవీరుల త్యాగాలకు నివాళిగా మెగా రక్తదాన శిబిరం

జైపూర్, అక్టోబర్ 29,ప్రభాతవార్త

విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ ఇందారంలోని మహి ఫంక్షన్ హాల్‌లో బుధవారం అమరవీరుల త్యాగాలకు నివాళిగా జైపూర్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ముఖ్యఅతిథిగా హాజరై మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఏ.సి.పిలతో కలిసి ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. విద్యార్థినీ విద్యార్థులకు ప్రజా రక్షణ, భద్రతకు సంబందించిన పోలీసు చట్టాల గురించి, పోలీసు విధులపై, షీ టీమ్స్, భరోసా సెంటర్స్ గురించి, కమ్యూనికేషన్ సిస్టం గురించి ఫింగర్ ప్రింట్ డివైస్‌ల వల్ల కలిగే ఉపయోగాల గురించి, బీడీ టీమ్ ఎక్విప్మెంట్, డాగ్ స్క్వాడ్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, రోడ్డు ప్రమాదాలు స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి, సైబర్ నేరాల గురించి పోలీసులు ఉపయోగిస్తున్న మిగతా 2లో..






## సైబర్ క్రైం మోసం కాగజ్‌నగర్‌లో

# వరుస కేసులు నమోదు

✷ మధ్యప్రదేశ్ నిందితుడి అరెస్టు ✷ ఒక కేసులో స్టాక్స్ పేరుతో రూ. 76 లక్షలు

✷ మరో కేసులో రూ. 45,790

కాగజ్‌నగర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణం, గ్రామీణ పోలీస్ స్టేషన్‌లలో సైబర్ క్రైం వరుస కేసులు నమోదు కావడం జరిగింది. మంగళవారం రోజున కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బాధిత మహిళ ఫిర్యాదు మేరకు రూ. 76 లక్షలు ఆన్‌లైన్‌లో మోసం జరిగిందని గుర్తించినట్లు తెలిపారు. ఈ డబ్బు గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల బ్యాంకు ఖాతాలకు జమ అయినట్లు ఆన్‌లైన్‌లో సూచిస్తుందని మిగతా 2లో..

# రహదారి ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు

★ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో పాటు ఇతర అధికారులతో రహదారి ప్రమాదాల నివారణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమైన సూచికలు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రక్షణ పరమైన సూచిక బోర్డులు, వేగ నియంత్రణ హెచ్చరిక మిగతా 2లో..



# మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలి

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

అమృత్ 2.0 పథకం క్రింద జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని, ఇందు కొరకు అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో డిటిసిపి సంయుక్త సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, మంచిర్యాల డిటిసిపిఓ సంపత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన అంశంపై మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, మందమర్రి మున్సిపల్ అధికారులకు మొదటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. నగరం ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవడానికి, 20 సంవత్సరాల వరకు భవిష్యత్తు అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని తెలిపారు. డిజిటల్ మ్యాపింగ్‌లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించవచ్చని, నూతన డేటాను ప్రతిబింబించేలా జిఐఎస్ ఆధారిత ప్లాన్‌లను నవీకరించవచ్చని, తద్వారా అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. సమగ్ర ప్రణాళిక ద్వారా భవిష్యత్తు అభివృద్ధికి భూ వినియోగం, భవన నిర్మాణం, రవాణా, వివిధ రంగాల అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. 2051 సంవత్సరం నాటికి జనాభా మరింత పెరిగే అవకాశం ఉందని, తరగతుల వారీగా జనాభా ప్రాతిపదికన ప్రజలకు మిగతా 2లో..

# పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదు

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతికత గురించి, షీటీమ్, భరోసా, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు సిబ్బంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. పలు ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పోలీసులు చేసే సేవా కార్యక్రమాలకు ప్రజలు, యువత సహకరించినప్పుడు ఉత్సాహం, విశ్వాసం రెట్టింపు అవుతుందని అన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుమూల ప్రాంతంలను పోలీస్ వారు సందర్శించడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం ఒక పోలీస్‌శాఖతోనే సాధ్యం అవుతుందని అన్నారు. ఎంతోమంది పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరిస్తూ వారిని ఆదర్శంగా తీసుకొని దేశ, రాష్ట్ర అభివృద్ధిలో, సామాజిక సామరస్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంఘవిద్రోక శక్తులు దేశంపై గాని రాష్ట్రంపైగా దాడులకు పాల్పడినప్పుడు ఐక్యమత్యంగా ఉంటే రక్షించుకోగలమని అన్నారు. రాష్ట్ర, దేశ రక్షణ కోసం పోలీస్, ఇతర సెంట్రల్ అర్మడ్ ఫోర్స్‌లలో ఉద్యోగాలను సాధించి రాష్ట్ర దేశ రక్షణ కొరకు దోహదపడటం, సహకరించాలని కోరారు.

## రక్త దానం ప్రాణదానంతో సమానం...

రక్తదానం ప్రాణధానంతో సమానమని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా ప్రజల అత్యవసర పరిస్థితి ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్త దాన శిబిరాలు, ఓపెన్ హౌస్‌లు నిర్వహిస్తున్నామని అన్నారు. మనం చేసే రక్తదానం వలన అత్యవసర సమయంలో ఉన్న వారికీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్నిఫర్ డాగ్స్ తమ ప్రతిభతో ఆకట్టుకోగా, విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపు, పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కలిగించే లక్ష్యంతో కమీషనరేట్ పోలీస్ చేపట్టిన ఈ ఓపెన్ హౌస్ విద్యార్థులను ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, చెన్నూర్ ఇన్స్పెక్టర్ దేవేందర్, చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. నరేష్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, లక్ష్మి ప్రసన్న, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

## రక్తదానం అత్యున్నత మానవతా సేవ

### - ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ లాల్ పాటిల్

ఆసిఫాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

మనిషి చేయగలిగే అత్యున్నత మానవతా సేవ రక్తదానమని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ లాల్ పాటిల్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సమాజ సేవలో భాగస్వామ్యాన్ని గుర్తుచేస్తూ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం వారూ రక్తదానం చేసి పోలీస్ వ్యవస్థ సమాజ సేవలో ఎప్పుడూ ముందుంటుందనే సంకల్పాన్ని నిరూపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన రక్తం మరొకరి ప్రాణానికి ప్రాణాధారం అవుతుందన్నారు. ఇది కేవలం దానం కాదని, మనిషి తన పట్ల ఉన్న నిజమైన నిబద్ధతయని వివరించారు. పోలీసు ఉద్యోగం కేవలం చట్టం పరిరక్షణ మాత్రమే కాదని, ప్రజల జీవన రక్షణ కూడా అని తెపిపారు. ఈ నేపథ్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి పోలీస్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం మనం చేసే ప్రతి సేవా కార్యక్రమం వారికి అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన 103 మంది స్థానిక యువతకి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలుపుతూ వారి సేవాభావం సమాజంలో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం సైకిల్ ర్యాలీనీ నిర్వహిస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో కాగజ్నగర్ డిఎస్పి వాహిదుద్దీన్, సిఐలు, ఆర్ఐలు, ఏఆర్ హెడ్ క్వాటర్స్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, హోం గార్డులతో పాటు ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రక్తదాతలే రియల్ హీరోలు

### - బెల్లంపల్లి ఏసీపి రవికుమార్

బెల్లంపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త

రక్తదాతలే రియల్ హీరోలని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో బుధవారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో బెల్లంపల్లి డివిజన్ పోలీసుల సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ నిజజీవితంలో రియల్ హీరోలు రక్త దాతలని, ఈరోజు శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. ఈ శిబిరంలో స్వచ్ఛందంగా 246 మంది రక్తదానం చేశారని రెడ్ క్రాస్ సోసైటీ సభ్యులు తెలిపారు. ముందుగా ఎసిపి రవికుమార్ రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు సురభి శరత్ కుమార్, అభినవ సంతోష్ కుమార్, కాసర్ల శ్రీనివాస్, బెల్లంపల్లి డివిజన్ సభ్యులు లక్షి ్మ నారాయణ, బెల్లంపల్లి 1 టౌన్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి రూరల్ సీఐ అనూక్, తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, బెల్లంపల్లి ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల బృందం, ప్రభుత్వ దవాఖాన వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన ఇండ్లు, త్రాగునీరు, రహదారులు, ఇతర ప్రజాసేవలు ప్రణాళికాబద్ధంగా అందించేందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా, ఉద్యానవనాలు, పచ్చదనం అభివృద్ధి చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 37.67 కిలోమీటర్ల ఏరియాలో, మందమర్రి మున్సిపల్ పరిధిలో 38.98 కిలోమీటర్ల ఏరియాలో డ్రోన్, సోషియో ఎకనామిక్ సర్వే పూర్తి చేయడం జరిగిందని, ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయి సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్ కార్యకలాపాల సమయంలో అవసరమైన మద్దతును అందించాలని, సిబ్బంది అందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కార్యక్రమ నిర్వహణ కొరకు టిపిబివోలు, వార్డు ఆఫీసర్ లను సహాయకులుగా నియమించి బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత కార్యకలాపాల నిర్వహణలో మున్సిపాలిటీలో పబ్లిక్ నోటీస్ జారీ చేయాలని, సర్వే కార్యకలాపాల సమయంలో కన్సల్టెంట్‌లకు అవసరమైన సహాయం అందించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో రూపొందించే జిఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు సమస్యలను వివరిస్తున్న నాయకులు

## రోడ్ల నిర్మాణానికి అటవిశాఖ అనుమతి కోసం రాష్ట్ర గవర్నర్‌కు వినతి

తిర్యాని, అక్టోబర్ 29, ప్రభాతవార్త

మండలంలోని రోడ్ల నిర్మాణాలకు అటవిశాఖ అనుమతులను ఇప్పించాలని బుధవారం కుమ్రంభీం జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి వినతి పత్రాన్ని అందజేసి రోడ్ల సమస్యలను వివరించడం జరిగిందని రాజ్ గోండ్ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గుణవంత్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుండాల, మంగి, డొంగుర్‌గాం, పలు మారుమూల గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను ప్రధానంగా అత్యవసర పరిస్థితుల్లో ఆదివాసీ గిరిజనులు పడుతున్న అవస్థలను గవర్నర్‌కు వివరించడం జరిగిందన్నారు. మండలంలోని 5వ షెడ్యూల్‌లో ఉన్న గ్రామాలకు రోడ్ల నిర్మాణాల కోసం వెంటనే అటవిశాఖ అనుమతులు ఇప్పించాలని కోరగా గవర్నర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## సైబర్ క్రైం మోసం కాగజ్‌నగర్‌లో

# వరుస కేసులు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇదిలా ఉంటే బుధవారం రోజున గ్రామీణ ప్రాంత సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో 45.790 రూపాయలు మోసంపోయినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశీష్‌కుమార్ దోహర్‌ను అరెస్టు చేసి రూ. 34537.38 ఫ్రిజ్ చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా డబ్బులు ఏ అకౌంట్‌కు వెళ్లాయో డిఫోర్‌సి బృందంతో సాంకేతిక ఆధారాలు సేకరించి ట్రేస్ చేయగా ఆ అకౌంట్ మధ్యప్రదేశ్ రాష్ట్రం సాత్నా జిల్లాకు చెందిన ఆశిష్ కుమార్ దోహర్ వాడుతున్నట్లు నిర్ధారించారు. అకౌంటు పేరును ఆశిష్ కిరాణా స్టోర్ అనిమార్పు చేసి ఉపయోగించాడు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ కుమార్ డిఫోర్‌సి బృందం సమన్వయంతో మధ్యప్రదేశ్ రాష్ట్రంకు వెళ్లి నిందితుడిని తేదీ: 27.10.2025 రోజున సాత్నా ప్రాంతంలో పట్టుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్ తీసుకొని అక్కడి న్యాయస్థానం ముందు ప్రొడ్యూస్ చేసి, తేదీ: 28.10.2025న కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దర్యాప్తులో నిందితుడు ఒప్పుకున్న వివరాల ప్రకారం తాను టీ స్టాల్‌లో పని చేస్తూ జీవిస్తున్న సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఆకాశ్ వద్వాని అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిందని, అతను తనకు నీ ఏటీఎం, ఆధార్, మొబైల్ లింక్‌డ్ అకౌంట్ ఇస్తే నెలకు రూ. 10,000 ఇస్తా" అని చెప్పడంతో తన పంజాబ్ సింధ్ బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇచ్చినట్లు తెలిపాడు. ఆకాశ్ వద్వాని ఆశిష్ కిరాణా స్టోర్స్ పేరుతో అకౌంట్‌ను వాడుతూ వేరువేరు వ్యక్తులను ఆన్లైన్‌లో మోసం చేసి వచ్చిన డబ్బులు తన అకౌంట్‌లో జమ చేసేవాడని నిందితుడు వెల్లడించాడు. పిర్యాదుదారుని అకౌంట్ నుండి మోసపోయిన మొత్తం 45,790 రూపాయలలో రూ.34,537.38 రూపాయలు ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజలు తెలియని వ్యక్తులకి ఆధార్ పాన్ కార్డ్ అకౌంట్ డీటెయిల్స్ తెలియపరచవద్దు అని హెచ్చరించారు.

## రహదారి ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రతి వాహన చోదకుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించేందుకుజాతీయ రహదారుల సంస్థ అధికారులు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా మందిరం నుండి గుండి ఫ్లై ఓవర్ వంతెన వరకు ప్రధాన రహదారి పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. ఆర్టిసి బస్సులు, విద్యాసంస్థల బస్సులు కండిషన్లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి రామ్ చందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ లక్ష్మీనారాయణ, రోడ్డు రవాణా సంస్థ డిపో మేనేజర్, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏ.డి డాక్టర్ రవికుమార్

## పశువులకు తప్పకుండా టీకా వేయించాలి

**- ఏ.డి డాక్టర్ రవికుమార్**

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త

ఉచిత టీకా కార్యక్రమాన్ని పశుపోషకులు, రైతులు సద్వినియోగం చేసుకుని పశువులకు టీకా తప్పనిసరిగా వేయించాలని ఏ.డి డాక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని బోడెపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాలలో నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి మార్గదర్శకాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రైతులతో సమావేశమై నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రవికుమార్ మాట్లాడుతూ ఎఫ్.ఎం.డి టీకా ద్వారా జంతువులు వ్యాధి నుంచి రక్షణ పొందుతాయని, టీకా సమయానికి వేయించడం ద్వారా పాలు ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. రైతు, పశుసంరక్షణ సంబంధిత వివిధ అంశాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా.అడ్లూరి పరిమళ, పశువైద్య సిబ్బంది, మరియు ఫీల్డ్ బృందం పాల్గొన్నారు.




పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

## పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

కోనేరు కృష్ణ క్లాస్మేట్ కోడాలి ఉమా పదవి విరమణ వేడుక హైదరాబాద్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమా తమ ఉద్యోగ జీవితంలో నిబద్ధతతో, కృషితో, నిజాయితీతో సేవలు అందించారు. పదవీ విరమణ తర్వాతి జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో నిండిపోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. కృష్ణారావు తెలిపారు. ఉద్యోగ జీవితం ముగిసిన తర్వాత కూడా మనిషి సమాజానికి సేవ చేస్తూనే ఉండాలని, కొత్త తరం వారికి మార్గదర్శకత్వం వహించాలనే ఉద్దేశంతో జీవితం సాగించాలి అని అన్నారు .ఈ కార్యక్రమంలో కోనేరు నాగేశ్వరరావు, బూర నరసింహం, రిటైర్డ్ ఆర్డీఓ శంకర్, సాదిక్, ఇతర స్నేహితులు పాల్గొని ఉమాశుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఆనందభరిత వాతావరణంలో స్నేహపూర్వకంగా జ్ఞాపకాలను పంచుకున్నారు.

## నేడు సోయాబీన్ కొనుగోలు ప్రారంభం

సారంగాపూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

నేడు సోయాబీన్ కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు మార్క్ పేడ్ డియం ప్రవీణ్ రెడ్డి తెలిపినారు. సారంగాపూర్, బోరిగాంలలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసువాలని, సోయాబీన్ పంటకు ప్రభుత్వం క్వింటాలుకు రూ॥ 5,328 చొప్పున మద్దతు ధరను ప్రకటించిందని తెలిపిరు.



# మాస్టర్ ప్లాన్ కొరకు పూర్తి సమాచారం అందించాలి

**- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 29 ప్రభాతవార్త

అమృత్ 2.0 పథకం క్రింద ఎంపికైన కాగజ్ నగర్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ కొరకు సంబంధిత అధికారులు సమగ్ర సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకులు ప్లానింగ్ మహిపాల్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో మాస్టర్ ప్రణాళిక రూపొందించడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాగజ్ నగర్ మున్సిపాలిటీని అమృత్ 2.0 పథకం క్రింద ఎంపిక చేసినందున సమగ్ర అభివృద్ధి కొరకు సంబంధిత అధికారులు పూర్తి సమాచారాన్ని మున్సిపాలిటీకి అందించాలని తెలిపారు. గత 10 సంవత్సరాల క్రితం నుండి గల వివరాలను ఇంకో 50 సంవత్సరాల ముందు వరకు అవసరమైన రహదారులు, త్రాగునీరు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, చెరువుల అభివృద్ధి, బిపిల్ కుటుంబాలు, మురికి ప్రాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటి అన్ని అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని తెలిపారు. తద్వారా మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత స్థితిని అర్థం చేసుకోవడానికి, భవిష్యత్తు అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని, డిజిటల్ మ్యాపింగ్ లో భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించవచ్చని, నూతన డేటాను ప్రతిబింబించేలా జి ఐ ఎస్ ఆధారిత ప్రణాళికలను నవీకరించవచ్చని, తద్వారా అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. తరగతుల వారీగా జనాభా ప్రాతిపదికన ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించే విధంగా రూపకల్పన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

## యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గీతాంజలి

లక్షెట్టిపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త



భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు నిజామాబాద్ పట్టణంలో 25, 26, 27 తేదీల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మహాసభల్లో లక్షెట్టిపేట పట్టణానికి చెందిన గీతాంజలి యొక్క విద్యార్థి ఉద్యమాలను గుర్తించి తన సేవలో రాష్ట్రవ్యాప్తంగా ఉపయోగించుకోవాలని ఉద్దేశంతో రాష్ట్ర సహాయ కార్యదర్శి నియమించారు. నియామకం అనంతరం గీతాంజలి మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు రానున్న రోజుల్లో విద్యార్థులు ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తూ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు.

## నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన

బోథ్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

సోయా, మొక్కజొన్న పంటలు కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహించిన రైతులపై కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. రైతులు తాము పండించిన పంటలను కొనుగోలు చేయాలని బుధవారం సోనాల మండలం అంతరాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గు చేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందని, అయితే కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడి వల్లే రైతులపై కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని గురువారం సోనాల స్వచ్ఛంధంగా బంద్ ప్రకటించి రైతులకు మద్దతుగా నిలవాలని బిఆర్ఎస్ నాయకులు బుధవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

**- నేడు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల బందుకు పిలుపు - డివైఎఫ్ఐ మద్దతు**

ఆసిఫాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డివైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కళాశాలల బందుకు డివైఎఫ్ఐ మద్దతు ఇస్తుందన్నారు కొమురం భీం జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు బందు పాటించి సహకరించాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ విద్యార్థులు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉండటంతో పేద విద్యార్థులు పైచదువులు చదవలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫీజుల ద్వారానే పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, అలాంటి పెద విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. దాదాపు 1200 కోట్లు పెండింగ్‌లో ఉందని, కళాశాలల యాజమాన్యం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన విడుదల చేయడం లేదన్నారు. దీనితో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్ల జారీ కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికానంద్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్

# మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా ఎస్పి కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్పి చిత్తరంజన్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి జిల్లాలో మాదకద్రవ్యాల నివారణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ ను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని తెలిపారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిని నిలుపుదల చేయడం జరుగుతుందని, గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి పునరావాస కేంద్రానికి తరలించాలని తెలిపారు. పత్తి కొనుగోలులో ప్రభుత్వం చేపట్టిన కపాస్ కిసాన్ యాప్ గురించి రైతులకు వివరించే సమయంలో గంజాయి సాగు వలన జరిగే నష్టాలపై సైతం అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు, డ్రైవర్లు గంజాయి రవాణా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యాలయాలు ఉన్న ప్రాంతాలలో పాన్ దుకాణాలు ఉండకుండా పర్యవేక్షించాలని తెలిపారు. వసతి గృహాలు, కళాశాలల వద్ద ప్రత్యేకంగా నిఘా నిర్వహించాలని, టోల్ ప్లాజాల వద్ద తనిఖీలు చేపట్టాలని, బస్టాండ్ ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామాలలో, విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాల పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 69 కేసులు నమోదు చేసి 120 మందిని జైలుకు పంపించడం జరిగిందని, సంబంధిత శాఖల అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డిఎస్పి, జిల్లా రవాణా శాఖ అధికారి రామ్ చందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రాందాస్, డిపో మేనేజర్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకున్న కోనేరు కోనప్ప కుటుంబ సభ్యులు

# శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న కోనేరు కోనప్ప దంపతులు

**కాగజ్‌నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :**

నంద్యాల జిల్లా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రమాదేవి దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ మల్లికార్జున స్వామి వారిని బుధవారం దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. కోనప్ప దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఆశీర్వచనం స్వీకరించి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి సంవత్సరం శ్రీశైలం వచ్చి స్వామివారిని దర్శించుకోవడం తమకు ఆనందాన్నిస్తుందని కోనప్ప గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.

# నవంబర్ 3 నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు

## - జిల్లా మార్కెటింగ్ అధికారి యం.డి. షాహబోద్దీన్

**తాండూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలోని రెండు జిన్నింగ్ మిల్లులలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి యండి షాహబోద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ మండలంలోని రేపల్లెవాడ వద్ద గల మహేశ్వరి జిన్నింగ్ మిల్లు, దండేపల్లి మండలంలోని వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో నవంబర్ 3 నుంచి పత్తి కొనుగోళ్ళు ప్రారంబిస్తామని తెలిపారు. పత్తి రైతులు తప్పనిసరిగా కాపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. స్లాట్ బుక్ చేసిన రైతులు మాత్రమే పత్తిని సీసీఐ వారికి అమ్మడానికి తీసుకురావాలని పేర్కొన్నారు. పత్తి పూర్తిగా ఎండిన తరువాతనే తీసుకురావాలని, పత్తిలో 8 తేమ మించకుండా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తమ పత్తిని తీసుకొని వచ్చి మద్దతు ధర పొందాలని ఆయన పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ఆడే గజేందర్

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండలంలోని వంజరి భూతాయి గ్రామల్లో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ ఆడే గజేందర్ బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విధంగా చూస్తానని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కోరిక మేరకు గడప పూజ చేశారు. వారి వెంట ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్యా, బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బొడ్డు గంగయ్యా, మండల అధ్యక్షులు జల్కే పాండురంగ్, మండల సీనియర్ నాయకులు ఇర్ల శివుడు, మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల పరిశీలిస్తున్న దృశ్యం

# యుడైస్ పై అవగాహన సదస్సు

**సారంగాపూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**



మండలం కేంద్రంలోని రైతు వేదికలో యుడైస్ పై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. పాఠశాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని మండల విద్యాధికారి మహేందర్ తెలిపినారు. దీనిలో పాఠశాల విద్యార్థుల వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని. నూతన విద్యావిధానంలో విద్యార్థి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుంది. అలాగే ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేయాలని. నమోదు చేయడంలో నిరక్ష్యంల్ల వహిస్తే పాఠశాల ప్రధానోపాధ్యాయులుపైన, యాజమాన్యాలపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపినారు.

# బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా ఇంచార్జీగా దాగం శ్రీనివాస్

**బెల్లంపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా ఇంచార్జీగా బీఎస్పీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు దాగం శ్రీనివాస్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్, స్టేట్ కోఆర్డినేటర్ నిషాని రామచంద్రులు బుధవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో బీఎస్పీ పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని జిల్లాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర నాయకత్వం తనకు ఇచ్చిన జిల్లా ఇంచార్జి బాధ్యతలు నెరవేరుస్తానని అయన పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో పార్టీని అన్ని మండలాల్లో, మూడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో పటిష్టం చేస్తానని తెలిపారు. ప్రజాసమస్యల పై జిల్లా ప్రజలను మమేకం చేస్తానని జిల్లా ఇంచార్జి తెలిపారు. కాగా తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర నాయకత్వానికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్, కాన్సీరామ్‌ల ఆశయాల సాధనకు కృషిచేస్తామన్నారు. కార్యకర్తలను మాయావతి బాటలో నడిపిస్తానన్నారు.



# విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలను సవరించుకోవాలి

## - మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి

**నస్పూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సి కోడ్ వివరాలను సవరించుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటిఎఫ్ ప్రొసీడింగ్‌లను జనరేట్ చేసి ట్రెజరీకి అప్‌లోడ్ చేసినప్పుడు విద్యార్థుల ఈ పాస్ బ్యాంక్ ఖాతా, ఐఎఫ్ఎస్‌సి కోడ్ సరిగా లేదని చూపిస్తుందని, ఈ కారణంగా బిల్లులు ట్రెజరీకి అప్లోడ్ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సి కోడ్ తనిఖీ చేసుకోవాలని, సవరించేందుకు, ఎంటిఎఫ్ బిల్లులు జారీ చేయడానికి జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-5లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో పూర్తి వివరాలతో జాబితా తయారుచేసి ఆయా కళాశాలల కవరింగ్ లేఖలతో సమర్పించాలని తెలిపారు.

# వీర హనుమాన్ మందిరానికి భూమి పూజ

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వీరహనుమన్ ఆలయానికి గ్రామస్తులు బుధవారం ఉదయం పండితులు ప్రవీణ్ పాండే ఆధ్వర్యంలో భూమి పూజ ఘనంగా నిర్వహించారు. చాలా రోజుల నుండి రేకుల షెడ్డుతోనే ఉండగా, ఆలయం చుట్టూరా పూర్తిగా పాడైపోయింది. ఇదిలా ఉండగా గ్రామస్తులు అందరు వచ్చి శిథిలావస్థకు వచ్చిన ఆలయాన్ని తీసి వేసి గ్రామస్తుల సహాయ సహకారాలతో నూతన ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు కాలని వాసులు పాల్గొన్నారు.



భూమి పూజ చేసిన గ్రామస్తులు



కంటి చికిత్స కోసం బయలుదేరుతున్న ప్రజలు

## ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తా

### - వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున యాదవ్ అన్నారు. వారి తండ్రి క్రీ॥శే॥ అరిగేల లక్షుuuయ్య 33వ వర్ధంతిని పురస్కరించుకొని ఇటీవల చిర్రకుంట గ్రామంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు బుధవారం 60 మందిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ, షుగర్, సీబీపీ పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్ నిమిత్తం ప్రత్యేక వాహనంలో వారిని ఆదిలాబాద్లోని ఎల్ వి ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దీపక్ రావు, జిల్లా యూత్ అధ్యక్షులు గాజుల రాజేంద్ర ప్రసాద్, మండల అధ్యక్షులు సుంకరి పేంటు, మురళి గౌడ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

## తలండి శ్రావణి హత్యపై ఆదివాసీ సంఘాల ఆగ్రహం

### - కుటుంబానికి సత్వర న్యాయం చేయాలనీ

### తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

ఈ నెల 18వ తేదీన కులదూరహంకార హత్యకు గురైన కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రే గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ, నిండు గర్భవతి తలండి శ్రావణి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని బుధవారం పెంచికల్ పేట్ మండల ఆదివాసీ సంఘుల నాయకులు డిమాండ్ చేశారు. శ్రావణి హత్యకు కారణమైన వారిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా సత్వర న్యాయ విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలని డిప్యూటీ తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోయ సంక్షేమ సంఘం అధ్యక్షులు సోయం చిన్నయ్య, మండల అధ్యక్షులు ఆలం సకారం, నాయకులు సిడం అశోక్, ఆలం లస్మయ్య, మడవి మల్లేష్ సతీష్, పోశన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వేమనపల్లిలో గుడుంబా నిషేధిస్తూ తీర్మానం

**వేమనపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలో మారుమూల గ్రామాలు గుడుంబాపై యుద్ధం ప్రకటిస్తున్నాయి. వారం రోజుల క్రితం సుంపుటం, నాగారం గ్రామాలు బుధవారం రోజున వేమనపల్లి గుడుంబా, బెల్ట్ షాపులు, గుట్కాలు నిషేధిస్తూ గ్రామస్తులు తీర్మానం చేశారు. గుడుంబా తాగడం వల్ల పేద కుటుంబాలు అప్పుల పాలవడమేగాక అనారోగ్యం బారిన పడుతున్నారని, అందుకే రాజకీయాలకు అతీతంగా గుడుంబా నిషేధిస్తూనట్లు గ్రామ ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఎవరైనా గుడుంబా అమ్మిన, తయారుచేసిన, రవాణా చేసిన పోలీసులకు పట్టిస్తామని హెచ్చరించారు.



వేమనపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

# ఉద్యోగుల సంక్షేమానికే ప్రాధాన్యత

### - మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ

**మందమర్రి, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలోనే కాకుండా సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రాధాన్యతనిస్తుందని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జనరల్ మేనేజర్ రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏఐటియుసి) యూనియన్‌తో నిర్వహించిన 11వ నిర్మాణాత్మక సమీక్షా సమావేశంలో (స్ట్రక్చర్ మీటింగ్) గడిచిన సమావేశంలో జరిగిన పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా స్పందించిన జీఎం గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని అన్నారు. ఇదివరకు సహకరించిన విధంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, కేకే ఓసి ప్రాజెక్ట్ అధికారి మల్లయ్య, ఐఈడి ఎస్ ఈ కిరణ్ కుమార్, ఏరియా స్టోర్స్ డీజీఎం ఈఅండ్ఎం సురేష్, సివిల్ ఎస్ఈ రాము, రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ డివైసీఎంవో ఎం. మధు కుమార్, డివైపిఎం సందీప్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణ, సీనియర్ అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిఎం

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆడే గజేందర్

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండలంలోని భూతాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫడ్ మురళి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మురళీ సోదరుడు ఫడ్ లక్ష్మణ్ మరణించడాని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. చిత్రపటానికి నివాళులర్పించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బొడ్డు గంగయ్య, మండల అధ్యక్షులు జల్కే పాండురంగ్, బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, డైరెక్టర్ గవ్వల రాజు యాదవ్, వివిధ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## లంబడి గూడలో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్

**బెజ్జూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండలంలోని లంబడిగూడ గ్రామంలో బుధవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఎస్డిపిఓ వహీదుద్దీన్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు. ఇందులో భాగంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించగా 40 లీటర్ల గుడుంబా 1000 లీటర్ల పానకం, 15 పత్రాలు సరిగా లేని వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి, పానకాన్ని పారబోశామని పట్టుబడిన వాహనాలకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుడుంబా వల్ల జరిగే నష్టాలు,అది తయారయ్యే విధానాన్ని గురించి కౌటాల సిఐ బి. సంతోష్ కుమార్ గ్రామస్తులకు వివరించారు. ప్రజలు గుడుంబాకు దూరంగా ఉండి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ ఎస్ఐ లు సిహెచ్.సురేష్ కుమార్, డి.చంద్రశేఖర్, ఇస్లావత్ నరేష్ ,సర్తాజ్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# మంగిలో ఘనంగా కొమురం భీం వర్ధంతి

**తిర్యాని, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని ఉమ్మడి మంగి గ్రామపంచాయతిలో కొమురం భీం 85వ వర్ధంతిని బుధవారం రోజున పలు గ్రామల గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భీం జెండాను ఆవిష్కరించి, భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు కొట్నాక గణపతి మాట్లాడుతూ నేటికీ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిన, తెలంగాణ ఏర్పాటు అయి 11సంవత్సరాలు అవుతున్నా కానీ ఆదివాసీ గ్రామాల్లో సరైన రోడ్లు లేక మారుమూల గ్రామాల గిరిజనులు ఎన్నో ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. గ్రామాలలో అనారోగ్యానికి గురైతే 104,108 వాహనాలు వెళ్ళలేని గ్రామాలు ఎన్నో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికీ పాటుపడాలని ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్‌మేడి రాయిసిడం అచ్యుత్ రావు, పటేల్ రాయిసిడం కిసాన్ రావు, మాజీ సర్పంచ్ రాయి సిడం సోంబాయి, శంకర్, మాజీ ఉప సర్పంచ్ ఆత్రం బొజ్జి రావు, మంగి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, మంగి ఏఈవో ముతయ్య, తుంరం. రాంశావ్, కుంరం బక్కు, మరసుకోల జంగు, పంద్రం జల్మీశావ్. మాడవి రాజు, ఆత్రం వినోద్ కుమార్, కనక రమేష్, రవి. రాయిసిడం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



కుమురం భీంకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



విద్యార్థుల అభ్యాసన సామార్థ్యాలను పరిక్షిస్తున్న ఏసీఎంఓ

**- ఏసీఎంఓ పి ఉద్దవ్ కుమార్**

**తిర్యాని, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పిఎంఆర్‌సి ఏసీఎంఓ పి ఉద్దవ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం తిర్యాని మండలంలోని దంతన్ పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని జెండగూడ, బుగ్గగూడ, భీంజీగూడ, తదితర గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణి చేసిన శిశు బెంచీలు, నోటు పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బుగ్గగూడ, ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పర్యావేక్షణ కార్యక్రమంలో భాగంగా దంతన్ పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను సందర్శిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామార్థ్యాలను పెంపొందించాలని, మధ్యాహ్న బోజన పథకం మెనూ ప్రకారం ప్రతిరోజు నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలని ఉపాద్యాయులకు సూచించడంతో పాటు పాఠాశాలల్లో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని పలు సూచనలను, సలహాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్పి కనక కైలాష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

**చింతలమానేపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండలంలోని కర్జవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారి ఈసి అనిల్ మాట్లాడుతూ, జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పథకంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాదిలో చేపట్టబోయే పనులలో కొత్త కెనాల్స్, బావులు, చేను చుట్టూ కట్టలు, చేను మార్గాలలో మట్టి రోడ్లు, మొరం పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ఉండనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 262 పనులు ఉపాధి హామీ పథకంలో చేర్చినట్లు వెల్లడించారు. ప్రతి జాబ్‌కార్డు కార్మికుడికి రోజుకు రూ॥ 307 కూలీ లభిస్తుందని, నాలుగు గంటల పాటు పని చేయడం తప్పనిసరి అని తెలిపారు. అదే స్థలంలో రెండు సార్లు ఫోటోలు తీసుకోవడం తప్పనిసరి అని సూచించారు. జాబ్‌కార్డు ఉన్నవారే తమ పేరుపై పనులు చేయాలని స్పష్టం చేసిన ఆయన, పశువుల పాకలు, మేకల పాకలు, కోళ్ల పెంపకం, పారంలు వంటి కార్యక్రమాలను పట్టా పాస్‌బుక్, జాబ్‌కార్డు కలిగినవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇంగానీ ఇస్తారి, ఫీల్డ్ అసిస్టెంట్ చౌదరి శ్రీనివాస్, కారోబర్ సంజీవ్, గ్రామ పెద్దలు, జిపి సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ముదిగుంట గ్రామపంచాయతీలో ఉపాధి హామీ గ్రామసభ


ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మండల పంచాయతీ అధికారి

**జైపూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**


బుధవారం మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు అధ్యక్షతన ముదిగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను చేపట్టబోయే ఉపాధిహామీ పనుల గుర్తింపు నిమిత్తం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, టీ.ఏ శిరీష, ఉపాధిహామీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ గ్రామ సభలో ఉపాధిహామీ పథకంలో భాగంగా 1.పశువుల పాక, 2.కోళ్ళ షెడ్, 3.అజోల్లా, 4.నాడెపు కంపోస్టు పిట్, 5.మట్టి రోడ్డు నిర్మాణం, 6.చిన్న ఊట కుంటలు, 7.ఫారం ఫండ్, 8.మామిడి తోటల పెంపకం, 9.ఫారెస్ట్ కందకాలు 10.కొబ్బరి తోటల పెంపకం ప్రజలకు ఉపయోగపడుతూ, ఆదాయం సమకూరే పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం మొబైల్ ఆప్ తనిఖీ నిర్వహించి శానిటేషన్ పనులు 100 శాతం ఇంటి పన్నులు వసూలు తొందరగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇల్లు పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు. అభివృద్ధి పనులపై శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు..

**బజార్‌హత్నూర్, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని కడెం వాగు వద్ద భారీ వర్షాలకు బ్రిడ్జికి ఇరు వైపుల కోతకు గురైంది. ఈ రహదారి గుండ రోజు కొన్ని వందల వాహనాలు నడుస్తాయి. బ్రిడ్జికు రెండు వైపుల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ గుంతలలో బైకర్లు కానీ, ఆటోలు కానీ అదుపు తప్పే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని మండల వాసులు కోరుకుంటున్నారు.






# మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

**వేమనపల్లి, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

వేమనపల్లి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి గొర్లపల్లి సమీపంలో నడిరోడ్డుపై మిషన్ భగీరథ పైప్ లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీరు భారీగా లీకేజీ అవుతున్నట్లు ఖగమిషన్ భగీరథ పైపు లీకేజీగగ అనే శీర్షికన ప్రభాతవార్తలో ప్రచురితం కాగా సంబంధిత అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ దేవేందర్, సైట్ ఇంచార్జి విజయ్ వెంటనే రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టారు. దీంతో గత కొంతకాలంగా వృథాగా పారుతున్న నీటికి అడ్డుకట్ట వేశారు. గత నెల రోజులుగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోయాయి. ఇక నుంచి అలాంటి సమస్యలు స్థానికులకు ఎదురవకుండా చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు నిత్యం తెలుపుతూ వాటి పరిష్కారం దిశగా వార్త కథనాలు అందిస్తున్న ప్రభాతవార్త పత్రికకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


దివ్యాంగ పిల్లలకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ మల్లేశం

# దివ్యాంగ పిల్లలకు టిఎల్ఎం కిట్స్ పంపిణీ

**తాండూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని భవిత కేంద్రానికి చెందిన ముగ్గురు మానసిక దివ్యాంగ పిల్లలు ఎస్కె హీన, జి.ప్రణీత్, జ్ఞానతేజన్ లకు బుధవారం టిఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)కిట్స్ ను మండల విద్యాధికారి మల్లేశం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గత ఏడాది మంచిర్యాలలో నిర్వహించిన ఆర్టిఫిషియల్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా క్యాంపులో ముగ్గురు దివ్యాంగ పిల్లలు సెలెక్ట్ అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ వెంకటేష్, ఐఈఆర్పిఎస్ వెంకటేశ్వర్లు, సతీష్, సిఆర్పి తిరుపతి, దివ్యాంగులు పేరెంట్స్ పాల్గొన్నారు.

# రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేత

**తాండూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త**

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బెల్లంపల్లి పద్మశాలి భవన్ లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో తాండూర్ మండలానికి చెందిన 25 మంది యువకులు, 10 మంది పోలీస్ సిబ్బంది రక్తదానం చేసినట్లు తాండూర్ సిఐ దేవయ్య, ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. వీరికి బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, తాండూర్ సిఐ దేవయ్య, ఎస్సై కిరణ్ కుమార్, రెడ్ క్రాస్ ఆర్గనైజింగ్ సభ్యులు సురభి శరత్ కుమార్, సంతోష్ కుమార్ ప్రశంస పత్రాలు అందజేశారు.


రక్తదాతలకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న పోలీసులు